క్లుప్తంగా

బహుమతుల ప్రదానం



ట్రోఫీ అందిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఈనెల 12న వేములవాడ మండలం శాత్రాజుపల్లిలో జరిగిన జిల్లాస్థాయి మహిళల వాలీబాల్ పోటీల్లో మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థులకు రూ.5వేలతో పాటు ట్రోఫీ అందజేశారు. పీఈటీ అనిల్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు మురళీధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



రుద్రంగి: మండల నూతన ఎస్సైగా సిరిసిల్ల అశోక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఎస్సైగా విధులు నిర్వహించిన రాజేశ్‌ను జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. చందుర్తి ఎస్సైగా బాధ్యతలు నిర్వహించిన సిరిసిల్ల అశోక్ రుద్రంగి నూతన ఎస్సైగా బదిలీపై వచ్చారు.

గడువు పొడిగింపు

ముస్తాబాద్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 20లోగా రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గురుకులాల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి 11న ప్రవేశపరీక్ష జరుగుతుందని, మరిన్ని వివరాలకు 180042545678 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

22న శోభాయాత్ర

ముస్తాబాద్: అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా మండలంలో ఊరూరా ఉత్సవాలను పండగలా నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేరుగు అంజాగౌడ్, ఖండ ఇన్‌చార్జి గూడూరి దేవేందర్ అన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ముస్తాబాద్‌లో చేపట్టనున్న ఉత్సవ వివరాలను గురువారం తెలిపారు. ఈనెల 22న మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయం నుంచి రాములోరి ఉత్సవ మూర్తులతో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. శ్రీ శివకేశవుల ఆలయం, అయ్యప్ప ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. హిందూ ఉత్సవసమితి బాధ్యులు బాలాజీ, జగదాంబ రాజు, రాజు, వెంకన్న, నందు, సంతోష్, శ్రీను, జగన్ తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విద్యార్థులు



లక్నవరం వంతెనపై విద్యార్థులు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లోని మార్గదర్శి పాఠశాల విద్యార్థులు విజ్ఞాన, విహారయాత్రకు వెళ్లారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా భద్రాచలం సీతారాముల ఆలయం, పర్ణశాలలో దర్శించుకొని పాపికొండలను సందర్శించారు. లక్నవరం వంతెన, రామప్ప, వెయ్యి స్తంభాల గుడి తదితర ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మండల చిరంజీవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో మూడేళ్ల జైలు

సిరిసిల్లక్రైం: కార్గోలో వచ్చిన వస్తువును తప్పుడు సమాచారం అందించి సెల్‌ఫోన్ తీసుకెళ్లిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పునిచ్చారు. చంద్రంపేట జ్యోతినగర్‌కు చెందిన మంచాల రామకృష్ణ కార్గోలో డిస్పాచ్ సెక్షన్ విధుల నిర్వహించాడు. సెప్టెంబర్ 2019లో ఓ వ్యక్తి కార్గోకు వచ్చి సెల్‌ఫోన్‌లో ఫొటో చూపించి వస్తువు తనదేనంటూ ఫోన్ నంబర్, ఇతర వివరాలు ఇచ్చి వెళ్లాడు. సదరు వ్యక్తి తప్పుడు సమాచారంతో వస్తువు తీసుకెళ్లినట్లు రామకృష్ణ సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శివనగర్ కొండ రంజిత్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు పరిశీలించిన న్యాయమూర్తి మోసానికి పాల్పడిన రంజిత్‌కు జైలు శిక్షతోపాటు రూ.5వేలు జరిమానా విధించారు.

వాహనాల తనిఖీ

బోయినపల్లి(చొప్పదండి): మద్యంతాగి వాహనాలు నడపవద్దని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. బోయినపల్లి పరిసరాల్లో గురువారం పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు



అధ్వానంగా మర్రిమడ్ల- మానాల రహదారి



రోడ్డుపై నిలిచిన బురదనీరు

- మర్రిమడ్ల, మానాల రోడ్డుకు రూ.9 కోట్లు మంజూరు
- తొమ్మిది నెలలక్రితం పనులు ప్రారంభం
- నెలలు గడుస్తున్నా ముందుకుసాగని పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మర్రిమడ్ల నుంచి రుద్రంగి మండలం మానాల వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైంది. రహదారి పనులకు నిధులు మంజూరుకాగా పనులు ప్రారంభించారు. నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ముందుకు సాగడంలేదు. దీంతో రెండు మండలాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

రూ.9కోట్లు మంజూరు

మండలంలోని మరిమడ్ల నుంచి మానాల వరకు గల రహదారి పనులకు రూ.9 కోట్లు మంజూరు కాగా అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు మే1న పనులు ప్రారంభించారు. ఈ నిధులతో మర్రిమడ్ల నుంచి మానాల వరకు నాలుగు కిలోమీటర్ల మేర తారురోడ్డు వేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు.

తగ్గనున్న దూరభారం

మర్రిమడ్ల నుంచి రుద్రంగి మండలం మానాల వరకు సుమారు 10 కిలోమీటర్లు ఉంటుంది. సాధారణ రోజుల్లో ద్విచక్రవాహనాలు వెళ్తుంటాయి. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డంతా బురదమయంగా మారి నడిచేందుకు కూడా వీలులేకుండా తయారవుతోంది. ఈ రోడ్డు గుండా వెళ్లలేని వారు సనుగుల-రుద్రంగి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. సనుగుల చెరువు నిండితే ఈదారి నుంచి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. హన్మాజీపేట, మూడపెల్లి గ్రామాల మీదుగా వెళ్లాలంటే సుమారు 60–70 కిలోమీటర్లు ఉంటుంది.

త్వరలోనే ప్రారంభిస్తాం

మర్రిమడ్ల నుంచి రుద్రంగి మండలంలోని మానాల రోడ్డు రెండు మండలాల ప్రజలకు ముఖ్యమైంది. ఈరోడ్డులో కొంతమేర అటవీ భూమి పోతుంది. తిరిగి వారికి భూమిని కొండాపూర్ శివారులో 7.73 హెక్టార్లు చూపెట్టారు. రెవెన్యూ అధికారులు ఆ భూమిని సేకరించి అటవీశాఖకు అప్పగించాలి.

–సురేశ్, డీఈ, రోడ్లు భవనాల శాఖ

పనులు పూర్తి చేయాలి



మరిమడ్ల–మానాల రహదారి రెండు మండలాల ప్రజలకు ముఖ్యమైన రోడ్డు. వర్షాకాలంలో వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పనులు పూర్తయితే రెండు మండలాల ప్రజలకు దూరం తగ్గుతుంది. ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి స్పందించి త్వరగా పనులు జరిగేలా చూడాలి.

– జింక శ్రీనివాస్, మర్రిమడ్ల

తొందరగా పూర్తిచేయాలి



మర్రిమడ్ల నుంచి మానాలకు వెళ్లాలంటే ఈ ద్వారా తొందరగా వెళ్లొచ్చు. వర్షాకాలంలో బురదమయంగా మారి నడవలేకపోతున్నాం. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అధికారులు చొరవ తీసుకోవాలి.య ఈ రహదారి పనులను తొందరంగా పూర్తిచేసి ఇబ్బందులు తీర్చాలి.

– పుల్కం మల్లేశం, మర్రిమడ్ల

రవాణా కష్టాలు తీర్చాలి



మరిమడ్ల నుంచి మానాల, రుద్రంగి, చందుర్తి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే దగ్గరి దారి. పనులు ప్రారంభించినా ఇప్పటివరకు ముందుకు సాగడం లేదు. ఈ పనులు త్వరగా పూర్తిచేస్తే రవాణా కష్టాలు తీరుతాయి. అధికారులు స్పందించి ఆయా గ్రామాల ప్రజల రహదారి కష్టాలు తీర్చాలి.

– కుమ్మరి దిలీప్‌కుమార్

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కరుణ

గంభీరావుపేట: అందరి సహకారంతో మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుకుందామని ఎంపీపీ వంగ కరుణ అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ వంగ కరుణ అధ్యక్షతన జరిగింది. గ్రామాల అభివృద్ధికి కోసం చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులను వెంటనే చెల్లించాలని సర్పంచులు కోరారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో అప్పులపాలవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పనులకు సంబంధించిన రికార్డులను అధికారులకు అందించాలని ఎంపీపీ సూచించారు. బిల్లులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. అనంతరం సర్పంచులను సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, వైస్ ఎంపీపీ దోసల లత, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అహ్మద్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నా పట్టించుకోలేదు



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

ముస్తాబాద్: సర్పంచులు అప్పులుచేసి అభివృద్ధి పనులు చేస్తే అధికారంలో ఉన్నప్పుడు బిల్లులు ఇవ్వకుండా మోసంచేసిన మాజీ మంత్రి కేటీఆర్‌కు అప్పుడు సర్పంచులు ఆత్మహత్యలు కనిపించలేదా అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో బీఆర్‌ఎస్ ఆసాములను ఆదుకుని మిగతా వారిని పట్టించుకో లేదన్నారు. ఎగువ మానేరులోకి నీరు వచ్చేలా కేకే మహేందర్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెలరాజు, నాయకులు నర్సింలు, సత్తయ్య, దేవేందర్, కొండయ్య, రాజిరెడ్డి, కొమురయ్య, నరేశ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నా బిల్లులు ఎందుకివ్వలే ?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అభివృద్ధి పేరుతో ఒకరు దోచుకుంటే అభివృద్ధి అంటేనే తెలియని వారు మరొకరు అంటూ మాజీ మంత్రి కేటీఆర్, ఎంపీ బండి సంజయ్ కుమార్‌పై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సర్పంచులకు బిల్లులు ఇవ్వలేదని పోరాటం చేస్తామనడం సిగ్గుచేటన్నారు. గతంలో అధికారంలో ఉండగా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రధాన కార్యదర్శి నేరెళ్ల నర్సింగం గౌడ్, పరుశరాములు, మునిగెల రాజు, అరెపల్లి బాలు, మహిళా నాయకుకరాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట ధూప, దీప, నైవేద్య అర్చకుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దౌల్తాబాద్ వాసుదేవ శర్మ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తిరునగరి వెంకటాద్రిస్వామి ఆదేశాల మేరకు అనంతగిరి శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీ పేరంబుదూరు సత్యనారాయణ, అధ్యక్షుడిగా వెగ్గళం సంతోష్‌శాస్త్రి, ఉపాధ్యక్షుడిగా చెరువు విట్టల్ శర్మ, కార్యదర్శిగా విద్యాసాగర్, కోశాధికారిగా శ్రీ పేరంబుదూర్ వేణుగోపాలాచారి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు గొంగ్లళ ఉమాశంకర్, రుద్రంగి, చందుర్తి మండలాల అధ్యక్షుడు కందాలై వెంకట రమణాచార్యులు, గోపికృష్ణమాచార్యులు, పురుషోత్తమాచార్యులు, తదితరులు సన్మానించారు.

కమిటీ ఎన్నిక

గంభీరావుపేట: మండల ధూప, దీప, నైవేద్య అర్చకుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాచర్ల పార్థసారథి శర్మ, ఉపాధ్యక్షుడిగా పంచరత్నాల మురళి, కార్యదర్శిగా వెంకటరమణచార్యులు, కోశాధికారిగా విద్యాసాగర్ ఎన్నికయ్యారు.

‘బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి’

సిరిసిల్లటౌన్: కేంద్రంలోని బీజేపీ చేస్తున్న మతతత్వ రాజకీయాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ అన్నారు. సిరిసిల్ల నెహ్రూనగర్ ఆర్‌ఎంపీ భవనంలో సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. బీజేపీ అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుకోసమే బీజేపీ మతతత్వ రాజకీయాలు చేస్తుందన్నారు. జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న దేశవ్యాప్త బంద్ చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, అధ్యక్షుడు ఎల్లారెడ్డి, కోడం రమణ, మోర అజయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22న ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఎల్లారెడ్డిపేట: అయోధ్యలో శ్రీరాంలాల విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండలకేంద్రంలోని సత్సంగ సదనంలో ఈనెల 22న ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సత్సంగ సద నం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి తెలిపారు. 22న ఉదయం 8గంటల నుంచి 10 వరకు భజన కార్యక్రమం, 10గంటల నుంచి 11గంటల వరకు శ్రీమద్రామాయణ ప్రవచనాలు, 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అయో ధ్య శ్రీరాంలాల విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా భ క్తులు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట: మండలంలోని నర్మాల మాజీ సర్పంచ్ ధ్యానబోయిన అంజయ్య తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ వార్డుసభ్యుడు లక్కిరెడ్డి రాజిరెడ్డి తండ్రి లింగారెడ్డి మృతిచెందగా పరామర్శించారు. సెస్ డైరెక్టర్ నారాయణరావు, సర్పంచ్ రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు రాజేందర్ ఉన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

బోయినపల్లి: మండలంలోని దేశాయిపల్లిలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఎస్‌ఏ ఆరిఫ్, టైపిస్ట్ వంశీ, గ్రామపంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్, ఐసీడీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మొర్రాయిపల్లెలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఎల్ఈడీ ద్వారా ప్రదర్శించారు.

చందాలతో అంత్యక్రియలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఇందిరమ్మ కాలనీ గ్రామానికి చెందిన సామల సిద్ధయ్య (55) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. నిరుపేద కు టుంబం కావడంతో దహన సంస్కారాలకు చిల్లిగవ్వ కూడా లేదు. దాతలసాయంతో చందాలు పోగుచేసి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య అనసూర్య, కుమారుడు రమేశ్ ఉన్నారు.

ఇరువురిపై కేసు

సిరిసిల్లక్రైం: వ్యవసాయ బావికి బిగించిన బోరు మోటారును దొంగతనం చేసిన వారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల సీఐ రఘుపతి తెలిపారు. చంద్రంపేటలోని లింగంపల్లి చంద్రయ్య అనే రైతు జలపతిరావుకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లగా బావి మోటారు కనిపించలేదు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గమనించి పరిసర ప్రాంతాల్లో వెతికాడు. గంధం సతీశ్, భూర తిరుపతి ద్విచక్రవాహనంపై మోటారును ఎత్తుకెళ్తుండగా అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

‘సర్పంచులకు సన్మానం హాస్యాస్పదం’

సిరిసిల్లటౌన్: తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్‌ఎస్ కనుసన్నల్లోనే పనిచేసిన పోలీసులు ఇప్పటికీ అదే కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయం విమర్శించారు. గురువారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇసుకమాఫియా ద్వారా నెలకు సుమారు రూ.కోటి పోలీస్ అధికారులకు ముడుతున్నట్లు ఆరోపించారు. జిల్లాలో వందలాది సంఖ్యలో బెల్ట్‌షాపులు ఉన్నాయన్నారు. సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా మాజీ మంత్రి కేటీఆర్ ఇటీవల సర్పంచులను సన్మానించడం హాస్యాస్పదమన్నారు. మండలానికి చెందిన ఓ ఎస్సైకి అక్రమ ఇసుక రవాణా చేసిన వ్యక్తి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపిన వివరాలను తెలిపారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, చోటు, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్



విద్యార్థిని ప్రశ్నిస్తున్న డీఈవో

ఎల్లారెడ్డిపేట: రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్ అన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్ సీపీఎస్, ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల్లోని ఎఫ్ఎల్ఎం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రతి శనివారం తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి నివేదికలు పంపించాలన్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ప్రధానోపాధ్యాయులు దబ్బెడ హన్మండ్లు, రామచంద్రం, కుబేర స్వామి, సీఆర్పీ శ్రీనివాస్, ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన అనుప రాజు అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. మృతుడి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆగయ్య మాట్లాడుతూ చిన్న వయస్సులో రాజు మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందన్నారు. చిన్న పిల్లలు ఉన్నారని.. ఎమ్మెల్యే కేటీఆర్‌తో మాట్లాడి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. అనంతరం రాచర్లగుండారం సర్పంచ్ భూక్య శంకర్‌నాయక్ అనారోగ్యానికి గురికాగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందె సుభాష్, మజీద్, భాస్కర్ తదితరులున్నారు.

చేనేత రంగానికి ఏం చేశారో చెప్పండి?



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట: చేనేత సంక్షోభం అంటూ మాట్లాడుతున్న నాయకులు గతంలో ఏం చేశారో చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీ బండి సంజయ్ చేనేత రంగానికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారోచెప్పాలన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నా చేనేతను పట్టించుకోని ఎమ్మెల్యే కేటీఆర్ ఇప్పుడు చేనేత సంక్షోభం అంటూ మాట్లాడడం విడ్డూరమన్నారు. బతుకమ్మ చీరలకు సంబంధించి ఇప్పటి వరకు రూ. 200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎందుకు చెల్లించలేదన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, నాయకులు ఎడబోయిన ప్రభాకర్, సింగిల్‌విండో డైరెక్టర్ రాజవీర్, గంగిస్వామి, ఎలుక రాజు, తాజొద్దీన్, గౌరీశంకర్, జంగం రాజు, గుడికాడి కుమార్, కిషన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదివిన 2001–2002 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు.

రాజన్న భక్తులకు చలువ పందిళ్లు



ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు



లడ్డూ కౌంటర్ల కోసం స్థలం పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: మేడారం సమ్మక్క–సారక్క జాతరకు ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. దీంతో రాజన్న దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆలయ అధికారులు చలువపందిళ్ల పనులను గురువారం ప్రారంభించారు. శివరాత్రి జాతర సైతం సమీపిస్తుండడం, త్వరలోనే ఎండలు ముదిరే అవకాశాలు ఉండడంతో చలువపందిళ్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ డీఈ రఘునందన్ తెలిపారు.

ప్రత్యేక లడ్డూ కౌంటర్లు

మహాశివరాత్రి జాతరకు తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక లడ్డూ కౌంటర్ల ఏర్పాటుపై ఆలయ అధికారులు దృష్టి సారించారు. మహాశివరాత్రి జాతర జరిగే మూడు రోజులపాటు భక్తులు ఆలయ పడమర వైపులోని మహిషాసురమర్దిని ఆలయం ముందు నుంచి దక్షిణం వైపు ద్వారం నుంచి బయటకు వెళ్తుంటారు. దక్షిణ వైపు ద్వారం పక్కనే గతంలో ఆంధ్రాబ్యాంకు ఉన్న భవనంలో లడ్డూ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ లడ్డూ కౌంటర్లు ఏర్పాటుపై పోలీసు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడం, భక్తులు త్వరగా బయటకు వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తడంతో ఆరుబయట ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాజేశ్వరపురం చివరి భాగంలోని జనరేటర్ షెడ్డు సమీపంలో కొత్తగా నిర్మించిన షెడ్డులో లడ్డూ కౌంటర్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఆలయ డీఈ రఘునందన్, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది రామకిషన్‌రావు, నాగరాజు ఏర్పాట్లు పరిశీలించారు.

వేతనాలు పెంచాలని నిరసన



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

చందుర్తి(వేములవాడ): మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ అన్నారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఫిబ్రవరి 4న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి పద్మశాలీ కల్యాణ భవనం వరకు నిర్వహించే ర్యాలీకి జిల్లాలోని అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు తరలిరావాలన్నారు. విజయ, లక్ష్మి, రేణుక, లక్ష్మి, మల్లవ్వ పాల్గొన్నారు.